TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9440555990

సంపుటి : 01 సంచిక : 302 | బుధవారం, జూలై 09 ,2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

# జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించండి: సీఎం రేవంత్



» ZISC అభివృద్ధి కోసం జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు కార్యక్రమం కింద ఆమోదించిన ? 596.61 కోట్లను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

» ZISC కి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్, ఇతర సౌకర్యాల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు.

»హైదరాబాద్ - వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు.

న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి బిజీ బిజీగా గడుపుతున్నారు. వరుసగా కేంద్ర మంత్రులతో భేటీ అవుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం (జూలై 8) ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్?ను కలిశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించాలని గోయల్ కు విజ్ఞప్తి చేశారు సీఎం రేవంత్. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి పలు కీలక ప్రాజెక్టుల విషయంపై చర్చించారు.

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు కార్యక్రమం కింద ఆమోదించిన 596.61 కోట్లను సత్వరం విడుదల చేయాలని కోరారు. 2లో..

## దేవాలయ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్ట్



హైదరాబాద్: భద్రాచలం ఈవో రమాదేవిపై జరిగిన దాడి ఘటనపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఈవోలపై దాడి చేస్తే ఊరుకునేది లేదన్నారు. దేవాలయ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఏపీ సీఎం చంద్రబాబును కొండా సురేఖ కోరారు.

ఏపీలోని పురుషోత్తపట్నంలో భద్రాచలం రామాలయానికి చెందిన భూముల్లో ఆక్రమణలను అడ్డుకునేందుకు మంగళవారం ఈవోతో పాటు సిబ్బంది వెళ్లారు. ఈవోపై గ్రామస్థులు దాడి చేశారు. దీంతో ఆమె స్పృహ కోల్పోయారు. ప్రస్తుతం ఈవో రమాదేవి భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం ఇవ్వాలి: మందకృష్ణ మాదిగ



దివ్యాంగులకు మద్దతుగా నిలవాల్సిన ప్రతిపక్షాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని మంద కృష్ణ మాదిగ అన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికి ఎమ్మార్పీఎస్ సిద్ధంగా ఉంది. 2లో




**పార్టీ పదవులు ఓబీసీలకు ఇస్తరా అన్న ప్రశ్నపై కవిత**

**లోకల్ బాడీ ఎన్నికల్లో బీఅర్ఎస్ క్లీన్ స్వీప్ చేస్తది**

**ప్రాంతీయ పార్టీలతోనే బీసీలకు మేలు**

**ఢిల్లీలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

ఢిల్లీ: బీఆర్ఎస్ ను ఇబ్బంది పెట్టే ప్రశ్నలను తనన అడగొద్దన్నారు ఎమ్మెల్సీ కవిత. బీఆర్ఎస్ పార్టీలో పదవులు ఓబీసీలకు ఇస్తారా..? అన్న ప్రశ్నకు ఆమె ఈ విధంగా సమాధానం చెప్పారు. పార్టీలో పదవులు కొందరికే లబ్ధి చేకూర్చుతాయని, సమాజంలో రిజర్వేషన్లు వ్యవస్థ మొత్తానికి లాభం చేకూర్చుతాయని చెప్పారు. ఇవాళ ఢిల్లీలో ఆమె మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. 2లో..

## భారత రాష్ట్ర సమితి నేతలు

### తీర్చుమార్చుకోకుంటే మళ్లీ అదే పరిస్థితి: భట్టి విక్రమార్క



మహబూబాబాద్: ప్రజలకు ఏం చేశామనే అంశాలపై శాసనసభకు వస్తే చర్చిద్దామంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరితే భారత రాష్ట్ర సమితి నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సవాల్‌ను స్వీకరించాల్సిన పెద్దమనిషిని శాసనసభకు రాకుండా చేస్తూ వేరొకరు ప్రెస్‌క్లబ్‌కు వెళ్లి అవాకులు చవాకులు పేలుతున్నారని పరోక్షంగా కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. అలా మాట్లాడినందుకే భారత రాష్ట్ర సమితికి లోక్‌సభ ఎన్నికల్లో 'సున్నా' వచ్చిందని.. ఆ పార్టీ నేతలు తీరు మార్చుకోకుంటే మళ్లీ అదే పరిస్థితి తప్పదన్నారు.

## మాట తప్పడం సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటే: కేటీఆర్



సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పడం అలవాటుగా చేసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు.

కాంగ్రెస్ అరాచక పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దాదాపు 600 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.

సీఎంకు ప్రాథమిక జ్ఞానం లేదని ఆరోపణ: "బేసిన్ల నాలెడ్జ్, బేసిక్ నాలెడ్జ్ లేని సీఎం చర్చకు రావాలి" అని కేటీఆర్ అన్నారు. 2లో

## బోనాల జాతర శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోండి






హైదరాబాద్: ఆషాఢ మాస బోనాల జాతర ఉత్సవాలు శాంతియుతంగా కొనసాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ అంబర్‌పేట్‌లో బోనాల జాతర ఉత్సవాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. 2లో

# సంపాదకీయం

## ఉపాధి హామీ పై పరిమితి,పేదలకు నష్టం

తెలుగు రాష్ట్రాలలో ఉపాధి హామీలో అధిక శాతం పనులు వేసవి నెలల్లో జరుగుతాయి. కేంద్రం తీసుకువచ్చిన కొత్త నిబంధనల వల్ల ప్రధానంగా తెలుగు రాష్ట్రాలలోని పేద ప్రజలు నష్టపోయే అవకాశం ఎక్కువ. గ్రామీణ పేదల హక్కులను కాలరాసే, వారి జీవనోపాధిని దెబ్బతీసే కొత్త నిబంధనలపై ప్రభుత్వం తిరిగి సమీక్షించాలి. లేకపోతే ప్రధాని నిత్యం వల్లించే 'మంచి ఉద్దేశంతో కూడిన మంచి పాలన' నినాదం నీటిమీద రాతగా మిగులుతుంది.ఉపాధి ఆదాయం కోసం మాత్రమే కాదు, అది మానవ గౌరవానికి సంబంధించింది.

ఇలాంటి గౌరవాన్ని కాపాడడమే లక్ష్యంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నరెగా) రూపొందింది. ఒక కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల పనిని హామీ ఇచ్చే ఈ చట్టాన్ని భారత సుప్రీంకోర్టు సామాజిక న్యాయానికి ఆలంబనగా నిలిచిన చట్టంగా అభివర్ణించగా, ప్రపంచంలో అతిపెద్ద పని హామీ పథకంగా 'గ్రామీణ ఉపాధి'ని ప్రపంచ బ్యాంకు గుర్తించింది.కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఈ పథకాన్ని బలహీనపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉండటం, వేతనాల చెల్లింపుల్లో కావాలనే ఆలస్యం చేయడం, సాంకేతిక జోక్యాల పేరుతో కార్మికులపై భారం వేయడం... ఇవన్నీ దీని లక్ష్యాలకు వ్యతిరేకంగా ఉన్నాయి. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా నరెగాకి సంబంధించి ఇటీవల కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం ఈ పథకాన్ని పూర్తిగా నిస్సారంగా మార్చే ప్రమాదాన్ని కలిగిస్తోంది. ఆ నిర్ణయం ఏమిటి? దాని ప్రభావం కార్మికులపై ఎలా ఉండబోతుంది అనే అంశాలను చర్చిద్దాం. చర్చలోకి వెళ్లేముందు నరెగా ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి కొన్ని ప్రాథమిక విషయాలు మననం చేసుకుందాం. నరెగా%-% ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే కార్యక్రమం. అయితే ఆర్థిక సంవత్సరం మొదట్లో ఆ సంవత్సరంలో ఉపాధి హామీలో పని డిమాండ్ ఎలా ఉంటుందో తెలియదు కాబట్టి, కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్లో అంచనాగా ఆ నిధులు కేటాయిస్తుంది. మునుపటి సంవత్సరపు నిధుల వినియోగం, రాష్ట్రాల నుంచి వచ్చే అభ్యర్థనలు దృష్టిలో ఉంచుకుని ఈ కేటాయింపు జరుగుతుంది. అయితే కేటాయించిన నిధులు ఖర్చు కాగానే, రాష్ట్రాలు అదనపు నిధుల కోసం కేంద్రాన్ని ఆశ్రయిస్తాయి. ఆ అభ్యర్థనలు పరిశీలించి కేంద్రం అదనపు నిధులు విడుదల చేస్తుంది. అంటే సిద్ధాంత పరంగా ఉపాధి హామీ బడ్జెట్ క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులకు గల డిమాండ్‌పై ఆధారపడి ఉంటుంది. ఇంకొక రకంగా చెప్పాలంటే అసలు ఉపాధి హామీ బడ్జెట్‌ను కట్టడి చేయడం చట్ట మూల సూత్రాలకు వ్యతిరేకం.

అసలు విషయానికి వస్తే, ఈ సంవత్సరం మే 29న కేంద్ర ఆర్థిక శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖకు ఒక అధికారిక లేఖ (ఆఫీస్ మెమొరాండం) జారీ చేసింది. అందులో 2025%-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి అర్థ సంవత్సరం (ఏప్రిల్-సెప్టెంబర్)లో నరెగా కోసం కేటాయించిన వార్షిక బడ్జెట్‌లో 60 శాతం వరకే ఖర్చు చేయాల్సిందిగా సూచించింది. ఈ నిర్ణయానికి వెనుక ఉన్న కారణాలను కేంద్రం స్పష్టంగా, బహిరంగంగా వెల్లడించలేదు. అయితే లేఖలో మాత్రం ఇది ఆర్థిక నిర్వహణపరమైన నిర్ణయమని మాత్రమే రేఖామాత్రంగా పేర్కొంది. కానీ ఈ నిర్ణయం పలు సమస్యలకు దారితీయవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారుబీ ఇందుకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అనుభవాలను ఉదాహరణలుగా చూపుతున్నారు.మొదటిగా, ఈ కొత్త విధానంలో ముఖ్యమైన అంశం- క్షేత్రస్థాయి అవసరాలతో సంబంధం లేకుండా, సంవత్సరం ప్రారంభంలోనే అంచనాల ఆధారంగా నరెగా నిధుల వినియోగాన్ని పరిమితం చేయడం. దీని ప్రకారం, నరెగా ఖర్చును ముందస్తుగా నియంత్రించాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఉందని అనుమానించక తప్పదు. ఈ అనుమానానికి కారణాలు ఉన్నాయి.

ప్రతి ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం ఖర్చయిన తర్వాత, అదనంగా నిధులు మంజూరు చేయడం సాధారణంగా అనుసరించే విధానం. కానీ గత దశాబ్దంలో తొలిసారిగా, 2024-25లో, కేటాయించిన మొత్తం ఖర్చు అయినప్పటికీ, కేంద్రం అదనపు నిధులు విడుదల చేయలేదు. అంతేకాకుండా, గత సంవత్సరం ఎక్కువగా పనులు నమోదవుతున్న తెలుగు రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో 'నియమాల ఉల్లంఘన' అనే పేరుతో ఉపాధి హామీ పనులకు అడ్డంకులు కలిగించింది. నిజానికి ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో గ్రామీణులు పని కోసం దరఖాస్తు చేసుకున్నా, వారికి పని లభించడం లేదని, పథకం అమలుచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పని డిమాండ్‌ను కృత్రిమంగా తక్కువ చేసి చూపుతున్నారని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వం 2023-24లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో పేర్కొంది. ఇప్పుడిక ఆ పరిమితి విధించే పనిలో కేంద్రం కూడా పాలుపంచుకుంటుందని అనిపించక మానదు. అలాగే రెండో అంశానికి వస్తే- 2025-26 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం నరెగాకు రూ.86వేల కోట్లు కేటాయించింది. ఇప్పుడు కేంద్రం తెచ్చిన నియమాల ప్రకారం, తొలుత ఆరు నెలల కాలానికి 60 శాతం మించి అంటే ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రాలు రూ.51,600 కోట్ల కన్నా ఎక్కువ ఖర్చు చేయలేవు. ఉపాధి కోరితే ప్రభుత్వం పనిని కల్పించాలి అన్న నిబంధన ఉండగా, ఇప్పుడు కేంద్రం జరిపిన కేటాయింపుల పరిమితిని చూపిస్తూ పనిని నిరాకరించే అవకాశం ఉంది. ఇది నేరుగా చట్టాన్ని ఉల్లంఘించడమే.

ఇక మూడో విమర్శకు వస్తే- ఆరు నెలలకు అందుబాటులో ఉన్న 60 శాతం కేటాయింపు అంటే పైన పేర్కొన్న విధంగా రూ.51,600 కోట్ల నుంచి గత ఏడాది పెండింగ్‌లో ఉన్న రూ.18,300 కోట్ల బకాయిలను తీర్చాల్సి ఉంటుంది. అలా చేస్తే ఈ సంవత్సరంలో కొత్తగా పనికి మిగిలే మొత్తం కేవలం రూ.30,600 కోట్లు మాత్రమే. గత సంవత్సరంలో నరెగాలో ఒక కార్మికునికి ఒక్క రోజు పని కల్పించడానికి రూ.390 ఖర్చు అయ్యింది. అదే లెక్కన ఈ సంవత్సరం మొదటి ఆరు నెలల్లో కేవలం 78 కోట్ల పని దినాలు మాత్రమే కల్పించగలిగే అవకాశం ఉంది. గత సంవత్సరం మొదటి ఆరు నెలల్లో నరెగాలో 161 కోట్ల పని దినాలు నమోదు అయ్యాయి. అంతే కాకుండా ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ ఖర్చు చేయడానికి అవకాశం ఉన్న రూ.51,600 కోట్లలో 56 శాతం జూన్ 29 నాటికే ఖర్చు అయిపోయింది. ఇక మిగిలిన నాలుగు శాతం నిధులతో మిగతా మూడు నెలలు పనులు నడపాలి.

నిజానికి ఈ సంవత్సరమే కాదు, ప్రతి ఏడాది మొదటి ఆరు నెలల్లో బడ్జెట్‌లో దాదాపు 20 నుంచి 25 శాతం వరకు నిధులు గత సంవత్సరపు బకాయిల చెల్లింపునకే ఖర్చవుతున్నాయి. ఈ వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఖర్చులను ముందుగానే పరిమితం చేయడం వల్ల, కార్మికులకు అవసరం అయినప్పుడు పని దొరకకుండా పోయే అవకాశం ఎక్కువగా ఉంది. కేంద్రం ఈ నిర్ణయానికి 'ఆర్థిక మేనేజ్‌మెంట్' అనే పేరు పెట్టినా, దీని వెనుక ఉన్న ప్రాతిపదిక పూర్తిగా తప్పు అవగాహనపై ఆధారపడింది. కేంద్రం తీసుకువచ్చిన కొత్త నిబంధనల వల్ల ప్రధానంగా తెలుగు రాష్ట్రాలు నష్టపోయే అవకాశం ఎక్కువ. ఎందుకంటే మొదటి ఆరు నెలల్లో తెలుగు రాష్ట్రాలలో అధికంగా ఉపాధి హామీ పనులు జరుగుతాయి. ఉదాహరణకు 2024-25లో మొదటి ఆరు నెలల్లో తెలంగాణలో 84శాతం పనులు జరగగా, ఆంధ్రప్రదేశ్‌లో 74 శాతం పనులు జరిగాయి. కారణం- మన తెలుగు రాష్ట్రాలలో ఉపాధి హామీలో అధిక శాతం పనులు వేసవి నెలల్లో జరుగుతాయి. వర్షాలు ముమ్మరంగా పడుతూ, వ్యవసాయ పనులు అందుబాటులో ఉన్నప్పుడు నరెగా కార్మికులు వ్యవసాయ పనులకు హాజరవుతారు. నరెగా పనుల్ని వేరే ఉపాధి అవకాశాలు లేనప్పుడు

## జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించండి: సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్, ఇతర వసతుల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ - వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. హైదరాబాద్ - విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫీజుబిలిటీని అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు.తెలంగాణ ప్రభుత్వం ఆదిభట్లలో అత్యున్నతమైన మౌలిక వసతులతో ప్రత్యేకమైన రక్షణ, ఏరోస్పేస్ పార్క్‌ను ఏర్పాటు చేసిందని వివరిస్తూ, హైదరాబాద్ - బెంగళూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఏరో-డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని సీఎం రేవంత్ రిక్వెస్ట్ చేశారు.

పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తామని, కేంద్ర ప్రభుత్వం వాటికి మద్దతుగా నిలవాలనిగోయల్?ను? కోరారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్?తో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి , చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మాట తప్పడం

## సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటే: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: మాట తప్పడం సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటేనని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. చర్చ సిద్ధమంటూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరిన కేటీఆర్ ఇవాళ ఉదయం ప్రెస్‌క్లబ్ వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

"కాంగ్రెస్ అరాచక పాలనలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు 600 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ ప్రజలను మోసం చేశారు. బేసిన్ల నాలెడ్జ్, బేసిక్ నాలెడ్జ్ లేని సీఎం చర్చకు రావాలి. బహిరంగ చర్చకు రేవంత్‌రెడ్డి సవాలు విసిరితే మేం వచ్చాం. సవాలు విసిరిన సీఎం ఇక్కడకు ఎందుకు రాలేదు? సీఎం రాకపోతే మంత్రులైనా వస్తారని భావించాం. బహిరంగచర్చకు రావాలని సీఎంకు మరోసారి చెబుతున్నాం. కొత్త తేదీ, ప్రదేశం రేవంత్‌రెడ్డి చెబితే మేం తప్పకుండా వస్తాం. అసెంబ్లీలో చర్చించేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నాం. మైకులు కట్ చేయకుండా.. పూర్తిగా మాట్లాడే అవకాశం ఇస్తే అసెంబ్లీలో కూడా చర్చకు సిద్ధం" అని కేటీఆర్ అన్నారు.

### బోనాల జాతర శాంతియుతంగా

## జరిగేలా చర్యలు తీసుకోండి

మొదటిపేజీ తరువాయి

మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు కేసముద్రంలో రూ.294.78 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన బహిరంగసభల్లో డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


**రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి 10 వేల ఎకరాలకూ నీళ్లివ్వలేదు**

భట్టి విక్రమార్క మాట్లాడుతూ రైతులకు అన్యాయం చేశామంటూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని.. 9 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం అన్యాయం చేసినట్లా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలల్లోనే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేయటం అన్యాయం చేసినట్లా.. పండించిన పంటకు రూ.500 బోనస్ ఇవ్వటం తప్పవుతుందా..? అని నిలదీశారు. కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ వాటాల విషయంలో ముఖ్యమంత్రి ఇటీవలే అఖిలపక్ష సమావేశంలో మాట్లాడారన్నారు. రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని.. నీళ్ల విషయంలో ఎప్పుడైనా, ఎక్కడైనా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను మరిచి అప్పట్లో కేసీఆర్ మాట్లాడారన్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి పట్టుమని పది వేల ఎకరాలకు నీళ్లివ్వని వారు కూడా తమపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

**ప్రజలపై ప్రేమ ఉన్నట్లు వారు నటిస్తున్నారు: మంత్రులు**

ఆరుగురు మంత్రులు రెండు బహిరంగ సభల్లో పాల్గొనటం..తరలివచ్చిన జనాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగాలు స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార సభలను తలపించాయి. ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులను మంత్రులంతా వివరిస్తూ.. ఇందిరమ్మ పాలన, ప్రజాపాలనకు మద్దతుగా నిలవాలని కోరారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి వ్యక్తులను నిలబెడతాం.. మీరంతా ఒకతాటిపైకి వచ్చి భారీ మెజారిటీలతో గెలిపించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ఉనికి చాటుకోవడానికే భారత రాష్ట్ర సమితి నేతలు పేదలపై ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నారన్నారు. అన్నివర్గాల సంక్షేమం, పేదల అభ్యున్నతి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని.. కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి స్వగ్రామం ఇక్కడే ఉండటం..ప్రస్తుతం ఆయన కీలక పదవిలో ఉండటంతో ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుంచి రూ.400 కోట్ల వరకు నిధులు కేటాయింపు జరిగేలా చూశారని మంత్రులు సభలో చెప్పారు.

## దమ్ముంటే కేసీఆర్‌ను అసెంబ్లీకి తీసుకురావాలి: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్




హైదరాబాద్: భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. ఆడుతున్న డ్రామాలు కేటీఆర్ ఆపేయాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డితో కలిసి ఆయన మంగళవారం అసెంబ్లీ వద్ద విలేకరుతో మాట్లాడారు. కేటీఆర్ ప్రెస్‌క్లబ్‌కు వచ్చి మాట్లాడిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి వచ్చి చర్చించే దమ్ముంటే కేసీఆర్‌ను తీసుకుని రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్ స్థాయికి తగ్గట్లుగా మాట్లాడాలని.. చిల్లర చేష్టలు మానుకోవాలని హెచ్చరించారు. కేసీఆర్ లెటర్ ఇస్తే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చినట్లే ఏక కాలంలో రైతు రుణమాఫీ చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పారు.

### బోనాల జాతర శాంతియుతంగా

## జరిగేలా చర్యలు తీసుకోండి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. పోలీసు, రెవెన్యూ, దేవాదాయశాఖ, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక, విద్యుత్తు, జలమండలి ఇతర విభాగాల అధికారులు ఒక ప్రణాళికతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అంబర్‌పేట్‌లో నూతనంగా నిర్మించిన ఫ్లై ఓవర్, సర్వీస్ రోడ్లపై ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంట నగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున మంత్రులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. దొంగతనాలు, శానిటైజేషన్, మహిళల భద్రత కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటుకు మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, పోలీసు ఉన్నతాధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం ఇవ్వాలి: మందకృష్ణ మాదిగ

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, దివ్యాంగులకు పింఛను ఇవ్వకుండా మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ధ్వజమెత్తారు. దివ్యాంగులకు అండగా ఉండాల్సిన ప్రతిపక్ష పార్టీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, అందుకే ప్రభుత్వంపై పోరాటానికి తాము సిద్ధమైనట్లు చెప్పారు. దీనిలో భాగంగా అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులను కలిసి మద్దతు కోరుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే మంగళవారం భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావును కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వంపై పోరాటంలో భాగంగా ఈ నెల 13 నుంచి దివ్యాంగుల మహాగర్జన సన్నాహక సమావేశాలు జిల్లాల్లో నిర్వహించనున్నట్లు మందకృష్ణ తెలిపారు. ఆగస్టు 13న చలో దివ్యాంగుల మహాగర్జన కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎక్కడైతే హామీలు ఇచ్చారో అదే ఎల్బీ స్టేడియంలో సభ పెడుతున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం ఇచ్చే విధంగా ఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ ను ఇబ్బంది పెట్టే ప్రశ్నలు నన్నడగొద్దు: కవిత

మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీలో బిల్లు పాసైనందున కాబట్టి గవర్నమెంట్ ఆర్డర్ ఇస్తే రిజర్వేషన్లు అమలులోకి వస్తాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలో కన్నా ఢిల్లీలోనే ఎక్కువగా ఉంటున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ సీఎం ను పిలిపించుకోని మాట్లాడి గవర్నమెంట్ ఆర్డర్ ఇచ్చేలా కృషి చేయాలని అన్నారు.

42 శాతం బిల్లును పాస్ చేయకపోతే బీజేపీకి తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. బిల్లు కేంద్రం ఆమోదం తెలపకపోయిన, రాష్ట్ర ప్రభుత్వం జీవో ఇవ్వకపోయినా జులై 17 న రైల్ రోకో నిర్వహిస్తామని, దక్షిణాది నుంచి ఢిల్లీకి రైళ్లను రానివ్వబోమని చెప్పారు. ప్రస్తుతానికి ఒక్క రోజే రైల్ రోకో చేస్తామని, భవిష్యత్ లో నిరవధికంగా నిర్వహిస్తామని అన్నారు. 8 మంది బీజేపీ ఎంపీలతో తెలంగాణ ప్రజలకు ఒరిగిందేం లేదని చెప్పారు. కులగణనలో డేటా శాస్త్రీయంగా లేదని, ఎస్సీ, ఎస్టీ ల జనాభాలో ఒక్కశాతం పెరుగుదల ఉండటం, ఓసీలలో 6 నుంచి 7% ఎక్కువ కావడం సందేహాలున్నాయన్నారు. ప్రాంతీయ పార్టీలతోనే బిసిలకు మేలు జరుగుతుందని కవిత అభిప్రాయపడ్డారు. రైలురోకో మద్దతు కోరుతూ రేపు అన్నిపార్టీలకు లేఖలు రాస్తానని చెప్పారు.

## 'ప్రభుత్వ పాత్రేమీ లేదు'.. జ్యోతి మల్హోత్రా పర్యటనపై కేరళ మంత్రి



: పాకిస్థాన్ నిఘా సంస్థలకు భారత్ కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలపై యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా అరెస్టయిన సంగతి తెలిసిందే. గతంలో కేరళ పర్యాటకాన్ని ప్రచారం చేసేందుకు ఆ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి పీఏ. మహమ్మద్ రియాస్ నేతృత్వంలోని టూరిజం డిపార్ట్‌మెంట్ అమెకు స్పాన్సర్ చేసిందని తాజాగా పలు వార్తలు వచ్చాయి. తనపై వస్తున్న ఆరోపణలపై మహమ్మద్ రియాస్ స్పందించారు. గతంలో రాష్ట్రంలోని పర్యాటకాన్ని ప్రచారం చేసేందుకు నియమించిన ఓ ఏజెన్సీ టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి దేశంలోని పలువురు యూట్యూబర్‌లను రాష్ట్రానికి ఆహ్వానించిందని తెలిపారు. ఆ విధంగా ఆహ్వానించిన ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో జ్యోతి ఒకరని..ఆమెపై గూఢచర్య ఆరోపణలు రావడానికి చాలా కాలం ముందు ఇది జరిగిందని తెలిపారు. జ్యోతి మల్హోత్రా ఎంపిక వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ పాత్రేమీ లేదని మహమ్మద్ రియాస్ స్పష్టం చేశారు. కాగా పాక్ గూఢచారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న జ్యోతి మల్హోత్రా కేరళ రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానం మేరకు గతంలో ఆ రాష్ట్రాన్ని సందర్శించారని పలువురు భాజపా నేతలు సోమవారం ఆరోపించారు. 'ఆమె ఎవరిని కలిసింది? ఎక్కడికి వెళ్లింది? అసలు ఆమె అజెండా ఏంటి? పాక్‌తో సంబంధాలు ఉన్న వ్యక్తికి కేరళలో రెడ్ కార్పెట్ ఎందుకు వేశారు?' అంటూ ప్రశ్నించారు.

ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్ అయిన జ్యోతి మల్హోత్రా ట్రావెల్ విత్ జో పేరుతో ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తోంది. 2023లో పాక్‌కు వెళ్లిన సమయంలో ఆమె అక్కడి గూఢచర్య సంస్థ ప్రతినిధులతో టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ జ్యోతి..పాక్ అధికారులతో మాట్లాడినట్లు సమాచారం. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేసి, ప్రశ్నిస్తున్నారు. అయితే ఆమె పూర్తి అవగాహనతోనే పాకిస్థానీ ఇంటెలిజెన్స్ అధికారులతో సంప్రదింపులు కొనసాగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

# బోధన్ మున్సిపల్ పరిధిలో పథకాల అమలు తీరుపై కలెక్టర్ సమీక్ష





## - ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 08 :**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో లక్ష్యాల సాధన కోసం నిరంతర పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన బోధన్ మున్సిపాలిటీని సందర్శించారు. పట్టణంలో అమలవుతు న్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపడుతున్న ముందస్తు చర్యలు, ప్లాట్ల క్రమబద్దీకరణ దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్ ల జారీ తదితర అంశాలపై బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తో కలిసి అధికారులతో సమీక్ష జరిపారు. ఒక్కో వార్డు వారీగా ఆయా కార్యక్రమాల అమలు తీరును, సాధించిన ప్రగతిని సమీక్షిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. పేదలకు సొంత ఇంటిని సమకూర్చాలని ప్రభుత్వం ఉదాత్తమైన ఆశయంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో అలసత్వానికి తావులేకుండా లక్ష్య సాధన కోసం అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. ఇల్లు మంజూరైన లబ్దిదారులు అందరూ తప్పనిసరిగా ఇళ్ళను నిర్మించుకునేలా చూడాలన్నారు. నిర్మాణ పనులు చేపట్టే విషయంలో లబ్దిదారులకు ఏవైనా ఇబ్బందులు ఉంటే, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, లబ్దిదారులకు అవసరమైన తోడ్పాటును అందించాలని వార్డు అధికారులను ఆదేశించారు. ఆర్థిక స్థోమత లేని వారికి మెప్మా ద్వారా రుణాలు ఇప్పించాలని, వాటిని ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల కోసం వినియోగించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. తదుపరి సమీక్ష నాటికి ఇళ్ళ నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించాలని అన్నారు. చిత్తశుద్ధితో కృషిచేస్తూ, లబ్దిదారులకు ప్రోత్సా హం అందిస్తే తప్పనిసరిగా వారు ఇల్లు నిర్మాణం కోసం ముందుకు వస్తారని సూచించారు. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి దశల వారీగా రూ. ఐదు లక్షల ఆర్ధిక సహాయం అందిస్తోందని, అంతేకాకుండా ఉచితంగా ఇసుక సరఫరా, డ్వాక్రా, మెప్మా ద్వారా రుణ సదుపాయం కల్పిస్తుండడం వంటి అంశాలను వివరిస్తూ లబ్దిదారులు ఇల్లు నిర్మించుకునేలా చూడాలని, తద్వారా ప్రభుత్వ సంకల్పం నెరవేరేందుకు దోహదపడాలని కలెక్టర్ సూచించారు. ఆయా వార్డులలో నెలకొని ఉన్న పరిస్థితులపై వార్డు ఆఫీసర్లకు పూర్తి అవగాహన ఉండాలని, అప్పుడు సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయగలుగుతారని అన్నారు. కాగా, పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ హితవు పలికారు. నర్సరీల్లో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉంచాలని, వాటిని నాటి పరిరక్షించేలా అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించే విధంగా పకడ్బందీ చర్యలు చేపట్టడం కూడా అంతే ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. గత సీజన్ లో నాటిన మొక్కల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటాలని అన్నారు. నిర్దేశిత లక్ష్యానికి మించి మొక్కలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మొక్కలను ఆయా కేటగిరీలుగా విభజిస్తూ, పూలు, పండ్ల మొక్కలను నివాస గృహాల కోసం పంపిణీ చేయాలని, మూడు మీటర్ల వరకు ఎత్తు కలిగిన మొక్కలను అవెన్యూ, బ్లాక్ ప్లాంటేషన్ ల కోసం వినియోగించాలని తెలిపారు. నాటిన ప్రతి మొక్క బతికేలా పక్కాగా సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులను, ప్రజాప్రతినిధులను, అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని, పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు.వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, నివాస ప్రాంతాల నడుమ ఖాళీ ప్రదేశాలలో నిలువ నీరు ఉండకుండా చూడాలని అన్నారు. దోమల వ్యాప్తిని నిరోధించేందుకు మురికి గుంతలలో ఆయిల్ బాల్స్ వేయాలని, మంచినీటితో కూడిన వనరులలో గంబుషియా చేప పిల్లలు వదలాలని సూచించారు. ప్రతి శుక్రవారం అన్ని నివాస ప్రాంతాల్లో, వ్యాపార వాణిజ్య సంస్థలలో విధిగా డ్రై డే పాటించేలా చూడాలన్నారు. ఎక్కడైనా టైఫాయిడ్, మలేరియా, డెంగీ, విష జ్వరాలు వంటి పాజిటివ్ కేసులు నమోదు అయితే, పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేయించాలని, స్థానికుల బ్లడ్ శాంపిల్స్ సేకరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపించాలని, అవసరమైన వారికి చికిత్సలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్లాట్ల క్రమబద్దీకరణ కోసం నిర్ణీత రుసుము చెల్లించిన వారికి త్వరితగతిన ప్రొసీడింగ్ లు అందించాలని, అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు.సమీక్ష అనంతరం కలెక్టర్ బోధన్ పట్టణంలోని పాండుఫారం తర్పాను సందర్శించి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులను కలిశారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఇళ్ళను నిర్మించుకోవాలని, అవసరమైన తోడ్పాటును అందిస్తామని భరోసా కల్పించారు. కలెక్టర్ వెంట జిల్లా మలేరియా నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తదితరులు ఉన్నారు.

# ప్రైమరీ స్కూల్ పిల్లలు ఇంగ్లీష్ లో మాట్లాడుతున్నారు

## - జిల్లా కలెక్టర దివాకర టిఎస్

**ములుగు ప్రతినిధి (మన వెలుగు) జులై 08 :**
ప్రైమరీ పిల్లల్లో ఇంగ్లీష్ పట్ల భయాన్ని పోగొట్టి ఇంగ్లీష్ లో మాట్లాడే విధంగా దిశా నిర్దేశనం చేసిన దిశా ఫౌండేషన్, జిల్లా పాలనా యంత్రాంగంములుగు జిల్లా విద్యాశాఖ మరియు దిశా ఫౌండేషన్ & ఈఎల్ఎఫ్ ఇంగ్లీష్ వారి సౌజన్యంతో జిల్లాలోని 54 ప్రాథమిక పాఠశాలల్లో లర్న్ టు రీడ్ 90 రోజుల విద్యా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ మరియు అదనపు మెటీరియల్. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక స్థాయి పాఠశాలల విద్యార్థులలో ఇంగ్లీష్ పై ప్రత్యేక శిక్షణ.దిశా ఫౌండేషన్, ఈఎల్ఎఫ్ ఇంగ్లీష్ వారి సహకారంతో ముందుగా జిల్లా స్థాయిలో 54 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి ఈ పాఠశాలల్లో బోధించే 108 మంది టీచర్స్ కు ప్రత్యేక శిక్షణను ఇప్పించి, ప్రాథమిక స్థాయి విద్యార్థులు సులువుగా ఆసక్తిగా ఇంగ్లీష్ నేర్చుకునేందుకు అనేక బోధనోపకర ణాలను పోస్టర్స్, ఫ్లాష్ కార్డ్స్ మరియు డిజిటల్ పాటలు, రైమ్స్ ను డిజిటల్ రూపంలో పెన్ డ్రైవ్ నందు పొందు పరిచి అందజేయడం జరిగింది. అలాగే ప్రతి విద్యార్థికి సులువుగా అభ్యాసం చేసే విధంగా వర్క్ బుక్స్ అందిస్తూ, విద్యార్థులకు కావలసిన అదనపు మెటీరియల్స్ అందజేసి 108 మంది టీచర్స్ తో దిశా ఫౌండేషన్, జిల్లా పాలన యంత్రాంగం మరియు జిల్లా విద్యాశాఖ ఒక ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి దాని ద్వారా టీచర్స్ ను ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ విద్యార్థులకు ప్రారంభ పరీక్ష నిర్వహించి వారి యొక్క ప్రగతిని అంచనా వేస్తూ 90 రోజులపాటు ఈ ప్రత్యేక బోధన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.దీని ద్వారా ఎంపిక చేసినటువంటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఆటపాటలతో ఇంగ్లీషు లో బోధిస్తూ, విద్యార్థులకు బోధనోపకరణ సామాగ్రి అందజేయడం ద్వారా ఆహ్లాదకరమైన స్వేచ్ఛాయుత వాతావరణంలో అనుభవం ద్వారా విద్యను అందించడం జరిగింది.దీని ఫలితంగా విద్యార్థులు ఆటపాటలతో ఇంగ్లీషు పై మక్కువ పెంచుకొని ఆశించిన అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర చుకోవడం జరిగింది. తధానుగుణంగా దిశా కార్యక్రమం అమలు చేయబడుతున్నటువంటి పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లీషులో ధారాళంగా మాట్లాడే విధంగా శిక్షణను ఇవ్వడం జరిగింది.
దిశ కార్యక్రమం సాధించిన ప్రగతి...ఈ కార్యక్రమం ద్వారా ప్రాథమిక స్థాయి పిల్లల్లో 50 శాతం విద్యార్థుల్లో అక్షరాలను గుర్తించడం, 20 శాతం విద్యార్థులు మూడు అక్షరాలు ఉన్న పదాలను చదవడం రాయడం,45 శాతం విద్యార్థులు వాక్యాల రూపంలో ఉన్న వాటిని చదవడం రాయడం ద్వారా ప్రగతిని సాధించారు.ఈ కార్యక్రమం ప్రారంభం తర్వాత విద్యార్థులలో చదవడం రాయడానికి సంబంధించి అభివృద్ధి అనేది స్పష్టంగా కనబడింది.రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మన జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు కొండపర్తి గ్రామంలో విద్యార్థుల యొక్క ఇంగ్లీష్ భాష నైపుణ్యాన్ని చూసి చాలా సంతోషించి విద్యార్థులను మరియు ఉపాధ్యాయులను అభినందించారు.రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చల్వాయి ప్రాథమిక పాఠశాలను సందర్శించినప్పుడు విద్యార్థుల ఇంగ్లీష్



నైపుణ్యాన్ని చూసి సంబ్రమాశ్చర్యానికి గురై ఈ కార్యక్రమాన్ని మన జిల్లాలో చేపట్టిన జిల్లా కలెక్టర్ను ఇంతటి ప్రగతికి కృషి చేసిన దిశ ఫౌండేషన్ సభ్యులను, ఉపాధ్యాయులను అభినందిం చారు.చివరగా మొదటి విడత లో చేపట్టిన కార్యక్రమ ముగింపు ఉత్సవాలు కలెక్టరేట్ సమావేశ మందిరం నందు నిర్వహించగా జిల్లా కలెక్టర్ హాజరయ్యి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అదే విధంగా పిల్లల్లో అంతటి నైపుణ్య సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులకు సన్మాన పత్రం, బహుమ తులను అందచేశారు.ప్రైమరీ స్కూల్ పిల్లలు ఇంగ్లీష్ లో మాట్లాడుతున్నారు.. జిల్లా కలెక్టర దివాకర టి.ఎస్. బండారుపల్లి ప్రాథమిక పాఠశాలలో దిశ ఫౌండేషన్ వారు నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిక కావడం జరిగింది. ఇందులో పనిచేసే ఉపాధ్యాయురాలు దిశ ఫౌండేషన్ వారిచే శిక్షణ పొంది వారిచ్చిన మెటీరియల్ సహాయంతో బోధించడం ప్రారంభించారు.పిల్లలు చాలా ఉత్సాహంగా పాల్గొంటూ ఆడుతూ పాడుతూ ఇంగ్లీష్ నేర్చుకోవడం లో చాలా క్రియాశీలకంగా పాల్గొన్నారు. అతి తక్కువ కాలంలోనే ఒకటవ తరగతి చదివే పిల్లలు కూడా ఇంగ్లీష్ మాట్లాడేం దుకు ప్రయత్నిస్తున్నారు. పిల్లల్లో ఇంగ్లీష్ మాట్లాడే స్పృహ కల్పించిన దిశ ఫౌండేషన్ విజయం సాధించిందని చెప్పుకోవచ్చు.అదే విధంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగడానికి కూడా ఈ దిశా ఫౌండేషన్ దోహదం చేసింది అనడంలో అతిశయోక్తి లేదని చెప్పవచ్చు.దిశ ఫౌండేషన్ వారి ఈ కార్యక్రమం అతి తక్కువ కాలంలోనే సత్ఫలితాలు ఇచ్చినందున ఈ సంవత్సరం కూడా కొనసాగిస్తూ రెండవ విడతలో మరో 52 పాఠశాలలను ఎంపిక చేసుకొని ఆ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం రూపొందించడం జరిగింది. ఈ రెండవ విడత ప్రారంభ కార్యక్రమాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ నెల 9వ తేదీన జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసి ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు.

# స్థల సేకరణలో జాప్యాన్ని నివారించాలి

## - కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 08 :**
ప్రజోపయోగ పనుల కోసం అవసరమైన స్థల సేకరణలో జాప్యానికి తావులేకుండా ఆయా శాఖల అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్సు హాల్ లో మంగళవారం స్థల సేకరణకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గత వారం నిర్వహించిన సమీక్ష సందర్భంగా తీసుకున్న నిర్ణయాల అమలు, సాధించిన ప్రగతిని సమీక్షించారు. రోడ్ల నిర్మాణాలు, విస్తరణతో పాటు నూతన విద్యా సంస్థలు, వసతి గృహాలు, వైద్యశాలలు, మహిళా శక్తి భవనాలు వంటి వాటికి సొంత భవనాల నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలను సకాలంలో అందించేందుకు చొరవ చూపాలన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని, ఇతర శాఖలతో సంప్రదింపులు జరుపుతూ త్వరితగతిన స్థల సేకరణ ప్రక్రియ పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. ఎంపిక చేసే స్థలాలు ఆయా అవసరాలకు అనువైనవిగా, ప్రజలకు ఉపయుక్తంగా నిలిచేలా ఉండాలని కలెక్టర్ సూచించారు. స్థల సేకరణలో పరిహారం ఖరారైన వాటికి సంబంధించి చెల్లింపులు కూడా వెంటనే జరిగేలా చొరవ చూపాలని అన్నారు. సమావేశంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, మెప్మా పీ.డీ రాజేందర్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు భాస్కర్, రైల్వే, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, ఇరిగేషన్, టీజీఐఐసి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలి

## - రైతులకు ఆయిల్ పామ్ సాగు, లాభాలపై అవగాహన కల్పించాలి
## - జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు ప్రతినిధి (మన వెలుగు) జులై 08 :**



ఆయిల్ పామ్ విస్తరణ లక్ష్యాలను పూర్తి చేయాలని, రైతులకు ఆయిల్ పామ్ సాగు, లాభాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులకు సూచించారు.
మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తన ఛాంబర్లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి తో కలిసి ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణము, ప్రాసెసింగ్ ఇండస్ట్రీ (ఫ్యాక్టరీ) నిర్మాణము పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయిల్ పామ్ పంట సాగు పై, ఆయిల్ ఫామ్ కంపెనీ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం అవసరమైన డాక్యుమెంట్స్, పర్మిషన్స్, మౌలిక వసతుల కల్పన, కావలసిన ఏర్పాట్ల పై వివరంగా జిల్లా కలెక్టర్ అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ హార్టికల్చర్ సహకార, సంఘాల బలోపేతం, రైతుల సౌకర్యార్థం అనేక పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు.పంట మార్పిడి ద్వారా ఆయిల్ పామ్ పంట సాగు పై రైతులకు అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖ అవగాహన సదస్సులు, ప్రచారం నిర్వహించాలని సూచించారు. పామ్ ఆయిల్ పంట సాగు ద్వారా రైతులకు అనేక లాభాలు చేకూరుతాయని, ప్రభుత్వం కల్పించిన సబ్సిడీ, రాయితీల వివరాలను తెలియపరచాలన్నారు.జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యమునకు మించి సాధించాలని, లబ్ధిదారుల ఎన్నిక, రైతుల నుండి దరఖాస్తులను, రైతు వాటా సేకరణ, ప్లాంటేషన్ పూర్తి, మొదలగు పనులను, ఆయిల్ ఫామ్ కంపెనీ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. జిల్లాకు కేటాయించిన ఆయిల్ ఫామ్ విస్తీర్ణం లక్ష్యం 3000 ఎకరాలు సాధించడానికి వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు కలిసి ఒక నిర్దిష్ట ప్రణాళికలు తయారు చేసి ఈ మొదటి సీజన్ లోనే 75% లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ప్రతి వారంలో బుధవారం, శనివారం గూగుల్ మీట్ ఏర్పాటు చేసి తద్వారా ప్రగతిని వివరించాలని, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయడానికి స్థలం కేటాయింపు, సంబంధించిన అనుమతులు త్వరితగతిన అన్ని ఏర్పాట్లు త్వరగా చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి డి. సంజీవరావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, జిల్లా ఇండస్ట్రీస్ అధికారిసిద్ధార్థ రెడ్డి, డి ఈ ఆర్ డబ్లు ఎస్ వెంకట సతీష్, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వరరావు, కే.ఎన్ బయోసైన్స్ ఏరియా మేనేజర్ హేమంత్ కుమార్ రెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ (ఎమ్ఐఈ) వి.వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# దివంగత సీఎం వైఎస్ఆర్ కు ఘన నివాళి

**మెట్ పల్లి (మన వెలుగు) జులై 08 :**



బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కార్మికులు, కర్షకుల అపర భగీరథుడు, తుది శ్వాస వరకు ప్రజా సంక్షేమం కోసం కృషి చేసిన మహనీయులు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్ ఆదేశాల మేరకు మంగళవారం మెట్టుపల్లి కొమిరెడ్డి నివాస పార్టీ కార్యాలయంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. ఈ మేరకు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంట ప్రణయ్ మాట్లాడుతూ.. ప్రాంతీయ భేదం లేకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వెనుకబాటుకు గురైన తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేశారని, పార్టీలకతీతంగా పాలనలో సంపూర్ణ పారదర్శకత పాటించి ప్రజా శ్రేయస్సు కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని కొనియాడారు. అలాగే మాజీ శాసనసభ్యులు స్వర్గీయ కొమిరెడ్డి రాములు ఎమ్మెల్యేగా కొనసాగిన కాలంలో నియోజకవర్గ పనుల నిమిత్తం ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి నివాసంలోకి లేదా ఆయన కార్యాలయంలోకి నేరుగా దూసుకు వెళ్లే వారని అన్నారు. రాములు గారు అడిగిందే తడవుగా కోరుట్ల నియోజకవర్గం పై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి పనిని చేసి పెట్టే వారని, ప్రస్తుత మెట్టుపల్లి పట్టణాన్ని గ్రామపంచాయతీ నుండి మునిసిపల్ గా అప్డేట్ చేశారని, అలాగే ప్రాజెక్టు బాటలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్ర పురం గ్రామం నుండి వరద కాలువ కింద ఉన్న సమీప గ్రామాల చెరువులకు తూములు నిర్మించాలని కోరగా, తక్షణమే స్పందించిన సీఎం వైఎస్సార్.. తూములు నిర్మించారని అన్నారు. . నేడు వైయస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారితో కొమిరెడ్డి రాములు గారికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, అప్పటి ఆయన పాలనను కీర్తిస్తూ, ఆయన జ్ఞాపకాలను స్మరిస్తూ.. ఆయనకు మనస్ఫూర్తిగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ నూతల రాజారెడ్డి, వార్డు కౌన్సిలర్ యమ రాజయ్య, మైనారిటీ జిల్లా ప్రెసిడెంట్ రఫిక్, సింగరి లక్ష్మణ్, గుమ్మిరియాల పోచయ్య, ఎండి తహసీన్, ఆకుల రాము అల్లె నాగరాజు దీటి దీపక్, ఎండి రైసోద్దీన్, ఎండి అజీమ్, పాపేష్ ,ఎండి షరీఫ్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# వైస్సార్ సేవలు చిరస్మరణీయం

**మెట్ పల్లి (మన వెలుగు) జులై 08 :**




వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని టిపిసిసి డెలిగేడే కల్వకుంట్ల సుజిత్ రావు ఆదేశాల మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణను భారత దేశంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దిన మహా నాయకుడు ఎండాకాలం పంటలు నీళ్లు లేక సరిగా పండుతాలేవని ఆలోచించి వరద కాలువ అనే ఒక బ్రహ్మాండమైన కాలువను తవ్వించిన మహా నాయకుడు అందుకే ఈనాడు ప్రతి ఇంట్లో వైయస్సార్ ఫోటో ఉంది అంటే అది ఆయన చేసినటువంటి గొప్ప పనుల వల్లే అని తెలిపారు ప్రధానంగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు ఖుతుబోద్దిన్ పాషా రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి వందేమారుతి బాపూజీ కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ అమ్ముల పవన్ యూత్ నాయకులు బైండ్ల శ్రీకాంత్ కోరే రాజు కుమార్ కోట మహేష్ నవీన్ గోవి శీను రాకేష్ తదిరితేలు పాల్గొన్నారు

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY



# బీసీ బిల్లు మోదించకపోతే రైలు చక్రాలను ముందుకు కలదలనిచ్చేదే లేదు

**- జూలై 17న నిర్వహించబోయే రైల్ రోకో ట్రైలర్ మాత్రమే**

**- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రం తక్షణమే ఆమోదించాలి**

**- దేశమంతా రాజ్యాంగం పట్టుకొని తిరిగే రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డికి చెప్పి జీవో ఇప్పించాలి**






**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 08**
ఢిల్లీలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విలేకరుల సమావేశం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకపోతే ఒక్క రైలు చక్రాన్ని కూడా ముందుకు కదలనివ్వబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు.బీసీ రిజర్వేషన్ల బిల్లుపై మంగళవారం ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు.తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చేస్తున్న మోసానికి నిరసనగా,బీసీ బిల్లులను రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఈ నెల 17వ తేదీన రైల్ రోకో నిర్వహిస్తున్నట్లు ప్రకటించిన ఎమ్మెల్సీ కవిత... "ఒక్క రైలు చక్రాన్ని కూడా కదలనివ్వబోము.డెక్కన్ నుంచి ఢిల్లీకి రైళ్లను రానిచ్చేదే లేదు. ఆ స్థాయిలో రైల్ రోకో చేపడుతాము.బిల్లును ఆమోదించకపోతే రెండున్నర కోట్ల తెలంగాణ బీసీ బిడ్డలు బీజేపీకి గుణపాఠం చెబుతారు" అని వ్యాఖ్యానించారు.రైల్ రోకో కేవలం ట్రైలర్మాత్రమేనని, బిల్లును ఆమోదించకపోతే భవిష్యత్తులో నిరవధికంగా రైల్ రోకో ను నిర్వహిస్తామని హెచ్చరించారు.బీజేపీ డీఎన్ఏలోనే బీసీ వ్యతిరేకత ఉందని మండిపడ్డారు.రైల్ రోకోకు మద్దతు,బీసీ రిజర్వేషన్ల అమలు విషయంలో అన్ని పార్టీలకు లేఖలు రాస్తానని తెలిపారు.స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి రెండేళ్లు కావస్తున్నా వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.తాము చేసిన పోరాటాలు, ఉద్యమాలతో దిగొచ్చిన ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో బీసీ బిల్లులను ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించి చేతులు దులుపుకుందని మండిపడ్డారు. 2014లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత రాహుల్ గాంధీకి అకస్మాత్తు బీసీల పట్ల ప్రేమను ఒలకపోయడం మొదలుపెట్టారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఇంకా కులగణన నిర్వహించలేదని ఎండగట్టారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 (డీ) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వమే జీవో జారీ చేసి పెంచిన రిజర్వేషన్లను అమలు చేయవచ్చని, కాబట్టి రాజ్యాంగాన్ని పట్టుకొని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక ఫోన్ కాల్ చేసి జీవో ఇవ్వమని ఎందుకు సూచించడం లేదు?42 శాతం రిజర్వేషన్లను అమలు చేయించేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వంతో జీవో ఇప్పించాలని రాహుల్ గాంధీకి డిమాండ్ చేశారు.తాము ఓబీసీనని చెప్పుకునే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఆ వర్గాలకు న్యాయం చేసే అవకాశం లభించిందని, తెలంగాణ అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను రాష్ట్రపతి ఆమోదించేలా చొరువ తీసుకోవాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో అమలవుతున్న 69 శాతం రిజర్వేషన్ల తరహాలో తెలంగాణ బీసీ బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చాలని ప్రతిపాదించారు.కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బీసీలను మోసం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. గత ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని, కానీ ముఖ్యమంత్రి అంత దూరం ఆలోచించకుండా ముందు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి బీజేపీ కృషి చేయాలని, అప్పుడే ఆ పార్టీని ప్రజలు విశ్వసిస్తారని స్పష్టం చేశారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా బీసీ బిల్లు గురించి మాట్లాడకపోవడం దారుణమని మండిపడ్డారు.ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమల్లోకి వచ్చిన తర్వాత సుప్రీం కోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితిదాటిపోయిందని, 16 రాష్ట్రాల్లో 50 శాతానికి పైగా రిజర్వేషన్లుఅమలవుతున్నాయని,కాబట్టి రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి న్యాయపరమైన చిక్కులు ఉండవని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో అనేక లోపాలు ఉన్నాయని, 2014లో కేసీఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 52 శాతం బీసీలు ఉన్నట్లు తేలిందని, ఇప్పుడు కాంగ్రెస్ చేపట్టిన సర్వేలో బీసీలు కేవలం 46 శాతం మాత్రమే ఉన్నట్లు తేల్చారని వివరించారు.కాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనల్లో హాఫ్ సెంచరీ చేశారని, రాష్ట్రంతో తక్కువ.. ఢిల్లీలో ఎక్కువగా ఉంటారని ఎద్దేవా చేశారు. ప్రాంతీయ పార్టీలతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల అస్థిత్వాన్ని పరిరక్షించడమే కాకుండా అభివృద్ధి చేయడంలో ముందుందని పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్ లో అఖిలేష్ యాదవ్, ఒడిశాలో నవీన్ పట్నాయక్, తమిళనాడులో జయలలిత వంటి వారి నాయకత్వంలోని ఆయా పార్టీల ద్వారా ప్రజలకు లబ్ది జరిగిందని అన్నారు.

# వెల్నెస్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 08 :**
నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉద్యోగుల వెల్నెస్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు రిజిస్టర్ను, ఓపి విభాగాన్ని,ల్యాబ్ ను , స్టోర్ లో ఉన్న ఫార్మసీ విభాగాన్ని,మందుల నిల్వను, తనిఖీ చేసి రిజిస్టర్ లను వ రి శీ లి % శీ % చా ర ం . ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ సిబ్బంది అందరూ సమయపాలన పాటిస్తూ,రోగులకు అవసరమైన నాణ్యమైన సేవలను అందించాలని, మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, అవసరమైన రోగుల వద్ద నుండి బ్లడ్ శాంపిల్స్ తీసి టీ హబ్ కు పంపించాలని విధుల పట్ల ఎవరు నిర్లక్ష్యం వహించరాదని, లేనిచో శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వెల్నెస్ సెంటర్ వైద్యాధికారిని డాక్టర్ కృష్ణవేణి మరియు వెల్నెస్ సిబ్బంది ఉన్నారు.





# యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంగం ఏర్పాటు




**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 08 :**
భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి అధ్యక్షతన యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర మొదటి మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం జిల్లా కేంద్రంలో గల ప్రెస్ క్లబ్ లో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జాగృతి రాష్ట్ర నాయకులు కేర్ కళాశాలల అధినేత నరాల సుధాకర్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చెయ్యకపోవడం వలన విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అనేక సందర్భాల్లో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన కనీస స్పందన లేదని అన్నారు.అలాగే నేటి విద్యార్థులంతా ఆన్లైన్ గేమ్ లకు సోషల్ మీడియాకు బానిసరి కావద్దని భారతదేశం గర్వించదగా పౌరులుగా ఎదగాలని సూచించారు. అదేవిధంగా యుఎస్ఎఫ్ విద్యార్థి సంఘం విద్యార్థుల పక్షాన అలుపెరుగని పోరాటాలు చేస్తూ అనేక సమస్యల్ని పరిష్కరించే రకంగా కృషి చేస్తుందని ఇలాంటి విద్యార్థి సంఘాలకు విద్యార్థులు చేరి సమాజాభివృద్ధికి తోడ్పడాలని తెలియజేశారు.అలాగే ఈ సమావేశానికి అతిథులుగా హాజరైన జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కోయడ నరసయ్య మాట్లాడుతూ విద్యార్థులు అందరూ కూడా ఒక సావిత్రిబాయి భగత్ సింగ్ లాంటి త్యాగమూర్తుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో ఉన్నత చదువులు చదవాలని తెలియజేశారు.రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్,ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్రావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రైవేటు కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తున్నాయని అన్నారు అలాగే పోరాటంతోటే సాధించుకున్న తెలంగాణ లో విద్యార్థులు ప్రజలు రైతులు కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యల పరిష్కారానికి పోరాటం ఒక్కటే మార్గమని నమ్మి అనేక త్యాగాలు చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటూ విద్యార్థుల పక్షాన నిలబడి కొట్లాడుతున్న యుఎస్ఎఫ్ విద్యార్థి సంఘ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి మాట్లాడుతూ ప్రభుత్వ విద్య రంగ బలోపేతానికి, ప్రభుత్వ రంగ సమస్యలను పరిష్కారానికి మరియు ప్రైవేటు కార్పొరేటు విద్యాసంస్థల దోపిడి అరికట్టడానికి సెప్టెంబర్ నెలలో వైఎస్ఎఫ్ఐ తెలంగాణ మొదటి రాష్ట్ర మహాసభల వేదికపై ఉద్యమ కార్యచరణ రూపొందించుకొని మహనీయులు కోరుకున్న సమసమాజ స్థాపన దిశకై పోరాటాలని కొనసాగిస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బాదం తిరుపతి జిల్లా అధ్యక్షులు సిద్ధల నాగరాజు మరియు యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు వెంకటేష్, రాజేష్, మధు,నాగేష్, తిరుపతి, గణేష్ మరియు యుఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా నాయకులు మహేష్ వేణు గణేష్ బాబురావు శివ, జవహర్,ప్రశాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మెగా వైద్య శిబిరం

**- మెగా వైద్య శిబిరంను పోలీస్ సిబ్బంది సద్వినియోగపర్చుకోవాలి**

**- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య వెల్లడి**







**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 08**
నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కోసం మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు.ఈ క్యాంపుల లో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నారు. మంగళవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో మెగా వైద్య శిబిరం" ను పోలీస్ శాఖ ఆధ్వర్యం మల్లారెడ్డి, నారాయణ హాస్పిటల్స్ హైదరాబాద్ వారు ఈ కార్యాక్రమం నిర్వహించగా, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య హాజరయ్యారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన అనంతరం మెగా వైద్య శిబిరం ను ప్రారంభించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ.సిబ్బంది ఎల్లప్పుడు విధులు నిర్వహణలో ఉండటం వలన తమ ఆరోగ్యం పట్టించుకోకపోవడంతో ఎన్నో రకాల అనారోగ్యాలకు గురవుతున్నారని,ఆరోగ్యం పై అవగాహన ఎంతో ముఖ్యమని, సిబ్బంది యొక్క కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ప్రస్తుత పరిస్థితులలో వ్యాధులు ఏంతో వేగంగా విస్తరిస్తున్నాయని, అట్టి వ్యాధుల భారీన పడకుండా ఉండేందుకు తగిన ఆరోగ్య సూచనలు పాటిస్తే ఎంతో మంచిదని మనం తీసుకునే అన్నిరకాల ఆహర పదార్థలలో కల్తీ చాలా గలదని, కొన్ని వ్యాదులకు గతంలో వైద్యం అందుబాటు లో ఉండేది కాదని ప్రస్తుత సమాజంలో ఎంతో అత్యాదునిక వైద్య సదుపాయాలు అందుబాటులో గలవనిపేర్కొన్నారుప్రత్యేకంగా,ఆర్.బి.ఎస్,కంటి పరీక్ష, ఇ.సి.జి.2డి ఈకో,క్యాన్సర్ స్క్రిన్నింగ్,బిపి,షుగర్, మొదలగు వైద్య పరీక్షల ద్వారా ఈ వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి ఇతర వైద్య పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు.మనకు అందించే అందుబాటులో గల ఆరోగ్య భద్రతను సద్వినియోగం చేసుకోవాలని,ప్రతీ సంవత్సరం ఒక్కసారైన ఆరోగ్యం కోసం డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. మందులు వాడేదానికంటే ముందు జాగ్రతలు తీసుకోవడం మంచిదని అన్నారు.ఇలాంటి క్యాంప్ల ఏర్పాటు చేయడం ఎంతో అభినందనియమని, ఈ క్యాంప్ నేడు ఉదయం 09 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వాహిస్తారని దీనిని నిజామాబాద్,ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో గల సిబ్బంది / పోలీస్ కార్యలయం సిబ్బంది / పోలీస్ హెడ్ క్వార్టర్స్ సిబ్బంది / హోమ్ గార్డ్సు మరియు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యాక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్( అడ్మిన్) బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దైనందిన జీవితంలో భజనలు అద్వితీయమైనవి





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 08 :**
ఇందూరు జిల్లా వేల్పూరు శివారులో గల సాయిబాబా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అఖండ గురునామ స్మరణ సప్తభజనల్లో ఐదవ వసంతంలో అడుగిడి ఐదు రోజులుగా నిరంతరాయంగా సప్త భజనలు అత్యద్భుతంగా అమృతంగా అమోఘంగా అద్వితీయంగా భజన కళాకారులచే కొనసాగుతున్నాయి. కార్యక్రమానికి సప్త భజన కొరకై బెంగళూరు నుండి విచ్చేసిన ఆధ్యాత్మిక చింతనాపరాయణులు, ధర్మ ప్రచారకులు,ఆధ్యాత్మిక వక్త శ్రీ రాఘవేంద్ర స్వామీజీ మాట్లాడుతూ.గురు పౌర్ణమి సందర్భంగా సప్త భజనలు చేయడం అనేది ఒక సంప్రదాయ ఆచారం.దీనిలో గురువుల యొక్క గొప్పతనాన్ని జ్ఞానాన్ని మరియు మార్గదర్శకత్వం అని కీర్తిస్తూ ఏడు రకాల భజనలు చేస్తారు. ఈ భజనలు భక్తులను ఆధ్యాత్మికంగా మేల్కొల్పడానికి మరియు గురువుల పట్ల భక్తిని పెంపొందించడానికి దోహదపడతాయి. విఘ్నేశ్వర భజన, సరస్వతీ భజన, శివ భజన, విష్ణుభజన, లక్ష్మీ భజన, ఆంజనేయ భజన, గురు భజనలను చేస్తూ అహోరాత్రులు మేల్కొని ఉంటూ చక్కటి సామూహిక, దైవిక బంధమైన గీతాలను, పాటలను కీర్తిస్తూ గానం చేస్తారు. ఆశ్రమాలలో, దేవాలయాలలో భజన మండళ్ళ ద్వారా భక్తజనులు చైతన్యమయ్యే అవకాశం ఉంటుంది.మనసుకు ఏకాగ్రత, ఆహ్లాదం లభిస్తుంది. లయబద్ధంగా విధేయులై ఆలపించే పాటల్లో నిగూఢమైన శక్తి దాగి ఉంటుంది.తద్వారా స్నేహ సంబంధ బాంధవ్యాలు దృఢతరమవుతాయి. ఒకరి పట్ల ఒకరికి గౌరవ మర్యాదలు పెరుగుతాయి.దైనందిన జీవితంలో భజనల పాత్ర అద్వితీయమైనదని రాఘవేంద్ర స్వామీజీ అన్నారు. ఇలాంటి అరుదైన కార్యక్రమాల్లో లక్కొర, దొనకల్, సీతారాం పల్లె (అమీనాపూర్), మోర్తాడ్, పెర్కిట్, ఆర్మూర్, మోతే, వేల్పూర్ మున్నగు గ్రామాల భజన మండళ్ళ కళాకారులచే భజనలు భక్తులను రంజింప చేస్తున్నాయి. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, సాయి సేవకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# 5ప్యాకెట్ల గంజాయి స్వాధీనం

**- వివరాలు వెల్లడించిన ఎస్ఐ గంగాధర్**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 08 :**
నిజామాబాద్ నగరంలోని ఐదో టౌన్ పరిధిలో నిషేధిత గంజాయి విక్రయిస్తున్న ఒకరిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని 80క్వాటర్స్ కు చెందిన సాలుంకే రత్నదీప్ గంజాయికి అలవాటుపడి డబ్బుల సంపాదించాలనుకున్నాడు.



తెలిసిన వారి దగ్గర గంజాయి కొనుగోలు చేసి నిజామాబాద్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నాడు. సమాచారం తెలసుకున్న పోలీసులు డ్రైవర్స్ కాలనీలో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అతని వద్ద 5ప్యాకెట్ల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. గంజాయిని ఎవరైనా అమ్మిన లేదా కొన్న లేదా తాగిన వారిపై కేసు లు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పోలీసు విధులకు అడ్డగించిన నలుగురి అరెస్టు

**- చట్ట వ్యతిరేకంగా జాతీయ రహదారిపై వాహనాలను ఆపి, పోలీసు విధులకు ఆటంకపరచిన వ్యక్తులు**
**- పోలీసులతో దురుసుగా ప్రవర్తించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులు**
**- నేరడిగొండలో జాతీయ రహదారి దిగ్బంధనం, పోలీసులపై దాడి - 9 మంది పై కేసు నమోదు**

**బోథ్ (మన వెలుగు) జులై 08 :**
గత నెల 27 వ తారీఖున నేరేడుగొండ మండలం నందు రోడ్డుపై బైఠాయించి పోలీసు విధులను ఆటంకపరిచిన తొమ్మిది మందిపై కేసు నమోదు నలుగురి అరెస్ట్ రిమాండ్. అరెస్టు చేయబడిన నిందితుల పేర్లు :- ఏ2) జాదవ్ ప్రేమ్‌సింగ్ (తండ్రి: పూల్యా), వయస్సు: 47 సం., నివాసం: గాయడ్‌పల్లి గ్రామం, మామడ మండలం, నిర్మల్ జిల్లా.ఏ3) ఇందల్ ఇస్లావత్ (తండ్రి: శెత్యా), వయస్సు: 33 సం., నివాసం: గాయడ్‌పల్లి గ్రామం, మామడ మండలం, నిర్మల్.ఏ4) బ్రహ్మావత్ అరవింద్ (తండ్రి: దేవీచంద్), వయస్సు: 22 సం., నివాసం: గాయడ్‌పల్లి గ్రామం, మామడ మండలం, నిర్మల్ జిల్లా. ఏ7) జాదవ్ లక్ష్మణ్ (తండ్రి: ఉత్తమ్), వయస్సు: 38 సం., నివాసం:



గాయడ్‌పల్లి గ్రామం, మామడ మండలం, నిర్మల్.గత నెల 26వ తారీఖున ఆదిలాబాద్ జిల్లా నందు గల నేరడిగొండ మండలంలో జాతీయ రహదారి 44 (NH44)పై రాస్తారోకో నిర్వహించి, పోలీసులపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదైంది. ఈ ఘటన నందు నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసి ఈరోజు రిమాండ్కు తరలించడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారని,నేరడిగొండ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్ (ASI)గా పనిచేస్తున్న ఎం. రామకృష్ణ (ASI-4259) ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు వెల్లడించారు. జూన్ 26, 2025న రాత్రి 08:45 గంటల సమయంలో ASI రామకృష్ణ, కానిస్టేబుల్ జి. సంతోష్ (PC-3318)తో కలిసి నేరడిగొండలోని NH44 రోడ్డుపై స్థానిక పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అదే సమయంలో, నీలిమ దాబా సమీపంలో, నిర్మల్ జిల్లా మామడ మండలం, గాయడ్‌పల్లి గ్రామానికి చెందిన కాలా బాయి, ప్రేమ్ సింగ్ మరియు మరికొందరు స్త్రీ, పురుషులు రెండు ఐషర్ వాహనాలలో వచ్చారు.వారి గ్రామానికి చెందిన అదే సుజాత (భర్త: నటరాజ్, వయస్సు: 26 సం.) అనే మహిళను ఆమె భర్త, బంధువులు వేధింపులతో చంపారన్న ఆరోపణపై వారు NH44 రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి, అల్లర్లు సృష్టించారు. తక్షణమే ASI రామకృష్ణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని, NH44 రోడ్డు దిగ్బంధనాన్ని ఆపడానికి ప్రయత్నించారు. దీనివల్ల సాధారణ ప్రజలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫిర్యాదు దారుడు మరియు ఇతర పోలీసు సిబ్బంది వారిని సముదాయించడానికి ప్రయత్నించినప్పటికీ, వారు పోలీసుల సూచనలను పాటించలేదు మరియు వారి విధులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో, వారిలో కొందరు పోలీసుల చుట్టూ చేరి, కర్రలతో ASI రామకృష్ణ, కానిస్టేబుల్ జి. సంతోష్‌పై దాడి చేసి గాయపరిచారు. ఘటనను వీడియో రికార్డు చేస్తుండగా PC-3318 జి. సంతోష్ మొబైల్ ఫోన్‌ను కూడా ధ్వంసం చేశారు. అంతేకాకుండా, పోలీసులను చంపేస్తామని బెదిరించారు. ఫిర్యాదుదారుడు గాయపడటం జరిగింది.ఈ ఫిర్యాదులోని అంశాల ఆధారంగా, పోలీసులు క్రైమ్ నంబర్ 133/2025 కింద భారతీయ న్యాయ సంహిత (%దీమీ%)లోని సెక్షన్లు 127(2), 132, 121(1), 351(3) రెడ్ విత్ 3(5) కింద కేసు నమోదు చేశారు. సంబంధిత అధికారులకు సమాచారం అందించి, ఎఫ్ఐఆర్ కాపీని జారీ చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఈరోజు నలుగురు ముద్దాయిలను ఉట్నూర్ కోర్ట్ నందు ప్రవేశపెట్టగా 14 రోజుల జ్యుడిసరి రిమాండ్కు తరలించడం జరిగిందని తెలిపారు. చట్టం వ్యతిరేక కార్యక్రమాలు పోలీసు విధులను ఆటంకపరిచేలా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్ కి నిధులను విడుదల చేసి దళిత, గిరిజన పిల్లలకు చదువును అందించాలి

**- సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 08 :**




నిజామాబాద్ నగరంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ. రమేష్ బాబు మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం దళిత, గిరిజన కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించటం కొరకు ప్రైవేట్ పాఠశాలలలో చేర్పించడానికి నిర్ణయించి గత కొంతకాలంగా ఆయా వర్గాల పిల్లలకు అడ్మిషన్లను ఇప్పించటం జరిగింది.నిజామాబాద్ జిల్లాలో ఆరు పాఠశాలల్లో వందలాది మంది పిల్లలకు చేర్పించి చదువు నేర్పటం జరుగుతున్నది.గత సంవత్సరం నుండి పిల్లలకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ ను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోవడంతో. ఆయా పాఠశాలల యాజమాన్యం తల్లిదండ్రులు పిల్లల ఫీజులను కడితేనే చదువు చెప్పిస్తామని చెప్పి పిల్లలను ఇంటికి పంపుతున్నారు. ఫలితంగా తమ పిల్లల చదువు దూరమవుతుందని దళిత గిరిజన కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు గత కొంతకాలంగా జిల్లాలో ఆందోళనలునిర్వహించినప్పటికీ ఇంతవరకు వారి ఫీజు లను చెల్లించకుండా కాలయాపన చేయటంతో పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు అవుతున్న ఆయా పిల్లలను పాఠశాలలకు పంపలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని. ఇప్పటికైనా రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజు రియంబర్స్మెంట్ను చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని మెరుగుపరుస్తామని ప్రకటనలు ఇస్తూ వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలకే చదువు లేకుండా చేయటం ఏ రకంగా సామాజిక న్యాయం అవుతుందని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ఫీజులను చెల్లించి పిల్లలకు నాణ్యమైన విద్య అందే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. లేనియెడల విద్యార్థుల కొరకు సిపిఎం పార్టీ వారి తరఫున ఆందోళన చేయాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు,జిల్లా కమిటీ సభ్యులు సుజాత,నాయకులు శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వెండి బంగారు వర్తక సంఘం కార్యవర్గంను సన్మానించిన రాష్ట్ర కాంగ్రేస్ నాయకులు శ్రీనివాస్

**మెట్ పల్లి (మన వెలుగు) జులై 08 :**
ఇటీవల నూతనంగా ఎన్నికైన మెటుపల్లి వెండి బంగారు వర్తక సంఘం అధ్యక్ష కార్యవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బిజ్జారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం సన్మానించారు.ఈసందర్భంగా నూతన కార్యవర్గం అధ్యక్షుడు బిజ్జారపు నవీన్, ప్రధాన కార్యదర్శి తిప్పర్తి వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షుడు గాలిపెల్లి నాగరాజు,కోశాధికారి ఇల్లెందుల ఉదయ్,సహాయకార్యదర్శి తొగిటి నరేష్ లను శ్రీనివాస్ సన్మానించి,శుభాకాంక్షలు తెలియజేశారు.ఈకార్యక్రమంలో నాయకులు అవుట్ల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ జూనియర్ కాలేజీ ని సందర్శించిన DIEO జాదవ్ గణేష్ కుమార్


**బోథ్ (మన వెలుగు) జూన్ 08 :**
ఆదిలాబాద్ జిల్ల ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ను డీఈఓ జాదవ్ గణేష్ కుమార్ సందర్శించారు.ఈ సందర్భంగా అయన మీటింగ్ ఏర్పాటు చేసి కాలేజీ లో అడ్మిషన్ లు పెంచాలని మరియు విద్యార్థుల హాజరు శాతం పెంచాలని దిశా నిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమం లో కాలేజీ ప్రిన్సిపాల్ శంకర్ సర్ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.



# వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలు ఎన్నటికీ మరువలేనివి

**- రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 08 :**
మాజీ ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జిల్లా మరియు నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.



ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్,నూడా చైర్మన్ కేశ వేణు,పిసిసి ప్రధాన కార్యదర్శి రాంభూపాల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా తాహేర్ బిన్ హందాన్ మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి నిజామాబాద్ జిల్లాతో ఎంతో అవినాభావ సంబంధం ఉంది అని, ఆయన ఒక పుట్టినరోజును నిజాంసాగర్ లో జరుపుకున్నారు, అదేవిధంగా గుత్ప అలీ సాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్షల ఎకరాలకు నీరు అందించిన ఘనత వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఆయన అన్నారు.రాజశేఖర్ రెడ్డి ప్రస్తుతం మనతో ఉంటే జాతీయ కాంగ్రెస్లో ఉన్నత స్థాయిలో ఉండేవారు అని రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర నాయకత్వంలో ఉన్నప్పుడు జిల్లా ఎన్ఎస్యుఐ అధ్యక్షులుగా ఉన్న మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర నాయకులుగా తీర్చిదిద్దింది ఆయనే అని ప్రస్తుతం ఆయన శిష్యుడుగా మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు అని, వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలను ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరు అని, ఆయన ఆశయాలను ఆలోచనలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు తీసుకు వెళ్తున్నారని దానికి మనందరం మద్దతుగా ఉండాలని తెలిపారు.ఈ సందర్భంగా నూడా చైర్మన్ మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర అభివృద్ధి కొరకు ప్రజల సంక్షేమం కొరకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన నాయకుడని రైతులకు 24 గంటల విద్యుత్ అందించిన ఘనత రాజశేఖర్ రెడ్డి అని ఆయన అన్నారు, విద్యార్థుల చదువుల కోసం స్కూల్ షిప్ లు అందించి ఎంతో మందికి ఉచిత విద్యుత్ అందించాడని,రాష్ట్రాన్ని ఐటీ రంగాన్ని ముందుకు తీసుకువెళ్లిన నాయకుడని అన్నారు.ఈ సందర్భంగా రామ్ భూపాల్ మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి సేవలు మరువలేనివి అని,జిల్లాకు ఎత్తిపోతల పథకాలు అందించి సాగు తాగు నీరు అందించాడని ఆయన అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కొరకు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని ఆయన మార్గంలోనే రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఎస్ యుఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్,జిల్లా ఎస్టి సెల్ అధ్యక్షులు యాదగిరి,సేవాదళ్ అధ్యక్షులు సంతోష్,జిల్లా ఫిషర్మాన్ చైర్మన్ శ్రీనివాస్,నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు వినయ్, డీసీసీ డెలిగేట్ లవంగ ప్రమోద్,స్వామి గౌడ్,ముశ్న పటేల్,సంగెం సాయిలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఆ మహనీయుడు మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరం

**-వైఎస్సార్ అడుగుజాడల్లో నడుద్దాం**
**- కాంగ్రెస్ పార్టీ లో తిరుగులేని నాయకుడిగా ఏదిగిన మహా నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి**
**- బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్**

**బోథ్ (మన వెలుగు) జులై 08 :**
నేరడిగొండ మండలంలోని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ క్యాంప్ కార్యాలయం లో వైఎస్సార్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అయన హయాం లో ఎన్నో మంచి పథకాలు అమలులో తెచ్చి పేద ప్రజలకు సూపరిపాలన అందించిన మహా నేత అని అన్నారు. చరిత్రలో గుర్తు ఉండి పోయే 108 అత్యవసర అంబులెన్స్ సేవలు నేటి వరకు ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నాయి అని అన్నారు. అలాంటి నేత మనకు దూరం అవడం బాధాకరం అని అన్నారు కావున అయన అడుగుజాడల్లో నడిచి అయన ఆశయ సాధన కోసం కృషి చేద్దాం అని అన్నారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆడే వసంత్ రావు నియోజకవర్గ యూత్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి రెడ్డి మండల యూత్ అధ్యక్షులు హీరా సింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాయుడి రవి ఆత్మ డైరెక్టర్లు సింగరపు స్వామి కుంట శంకర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తీగల విలాస్, ఉమేష్ ,మునీర్, మౌలాన్, గజ్జల అశోక్, రాహేలు, ముక్తార్, ప్రశాంత్,మహేశ్,రోహిత్ దయాకర్ ,కపిల్ కార్థర్ సింగ్ పాల్గొన్నారు.



## సిపిఐ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 08 :**
నిజామాబాద్ నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి సుధాకర్ మాట్లాడుతూ. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అడవిలలో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారదత్తం చేయడానికి ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్కౌంటర్లను చేస్తున్నదని వెంటనే ఆపరేషన్ కగార్ నిలిపివేసి మావోష్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చాలని అన్నారు మే, జూన్ నెలలో సిపిఐ గ్రామ, మండల మహాసభలు జయప్రదం చేసుకొని జూలై 19న సిపిఐ జిల్లా మహాసభ ప్రగతి మున్నూరు కాపు సంఘం మీటింగ్ హాల్లో జరుగుతుందని ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్.అజీజ్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కామ్రేడ్.పశ్య పద్మ హాజరవుతారు.ఈ మహాసభలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించడం జరుగుతుందని ఈ మహాసభకు పార్టీ గ్రామ శాఖ కార్యదర్శిలు,మండల కార్యదర్శిలు, ప్రజాసంఘాల జిల్లా బాధ్యులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు ఈ ప్రెస్ మీట్ లో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, జిల్లా నాయకులు సక్కి సురేష్, ఆలి ఇమ్రాన్, భానుచందర్, మహేష్ పాల్గొన్నారు.



## హెడ్ కానిస్టేబుల్,ఏఎస్ఐ లుగా ప్రమోషన్

**- అభినందించిన జిల్లా పోలీసు కమిషనర్ పి.సాయి చైతన్య**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 08 :**
నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎనిమిది మంది హెడ్ కానిస్టేబులకు ఏఎస్ఐలుగా పదోన్నతులు పొందారు.తెలంగాణ రాష్ట్ర డిజిపి ఆదేశానుసారముగా నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హెడ్ కానిస్టేబుల్ నుండి ఏ.ఎస్ఐ లుగా ఎనమిది మంది ప్రమోషన్ పొంది నేడు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్యని కలిశారు.నందిపేట్ పిఎస్ కు చెందిన హెడ్ కానిస్టేబుల్ :1316 ఎం.డి. రియాజుద్దీన్,మోగ్పాల్, పి.ఎస్ కు చెందిన కే.పరమేశ్వర్, పి. వసంత్ రావు, టౌన్ %- ఎ×% పి.ఎస్ కు చెందిన జక్రయ్య,ఉమెన్ పోలీస్ స్టేషన్ పి.ఎస్ కు చెందిన కే.అరుణ కుమారి,637 రూరల్ పి.ఎస్ కు చెందిన.జి. అనురాధ, జీ. వి. రమనేశ్వరి, ముంతాజ్ బేగం లు పదోన్నతి పొందారు. గత కొంతకాలంగా ప్రమోషన్ గురించి ఎదురు చూస్తున్నటు వంటి హెచ్ సి లకు ఏఎస్ఐ లుగా ప్రమోషన్ రావడంతో సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారని.ఈ సందర్భంగా ప్రమోష న్ పొందినటువంటి ఏఎస్ఐ లకు పోలీస్ కమిషనర్ శుభాకాంక్షలు తెలియజేశారు.




## తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్న బిఆర్ఎస్ నేతలు చౌకబారు మాటలు మానుకోవాలి

**- స్థాయికి మించి బి ఆర్ ఎస్ నాయకులు ముఖ్యమంత్రి పై విమర్షలు చేస్తున్నారు**
**- ఇలాంటి నాయకులకు ప్రజలే బుద్ధి చెప్పాలి**
**- రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక సైనికుల పనిచేసి అభ్యర్థులను గెలిపించుకోవాలి**
**- బిఆర్ ఎస్ పాలనలో మానుకోట ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు**
**- మహబూబాబాద్ జిల్లా పర్యటనలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూలై 08 :**





రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి,18 నెలలు కాలంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు మంగళవారం మహబూబాబాద్ జిల్లాలోని పర్వతగిరి, సోమ్లా తండలో పలు అభివృద్ధి కార్యక్రమాలను డిప్యూటీ సీఎం భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి ప్రారంభమైందన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, గిరిజన ప్రాంతాలకు అధిక శాతం నిధులు కేటాయించడం జరిగిందన్నారు.అభివృద్ధికి అడ్డుపడుతున్న బీఆర్ఎస్ రాష్ట్రంలో అభివృద్ధికి బీఆర్ఎస్ నేతలు అభివృద్ధికి, అడ్డుపడుతూ ముఖ్యమంత్రిపై స్థాయికి మించి, విమర్శలు చేస్తున్నారని భట్టి అన్నారు. బీఆర్ఎస్ నేతలు చౌకబారు మాటలు మానుకోవాలని హితవు పలికారు. ఇలాంటి నాయకులకు ప్రజలే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక సైనికుల పనిచేస్తూ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు నాగరాజు, కనకయ్య,బెల్లయ్య నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.